నిర్మించి వదిలేశారు!



జవారిపేటలో నిరుపయోగంగా పల్లె దవాఖానా



వల్లంపట్లలో పల్లె దవాఖానా

- రూ.లక్షలాదితో పల్లె దవాఖానాల నిర్మాణం
- విద్యుత్, నీటివసతి లేక నిరుపయోగం
- ఇరుకు గదుల్లో వైద్యసేవలు
- ఇబ్బంది పడుతున్న సిబ్బంది

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లో రూ.లక్షలాది రూపాయలతో నిర్మించిన పల్లె దవాఖానాలు నిరుపయోగంగా మారాయి. దీంతో ఇరుకు గదుల్లోనే సిబ్బంది ప్రజలకు వైద్యసేవలు అందిస్తున్నారు. మండలంలోని జవారిపేట, రేపాక, వల్లంపట్ల గ్రామాల్లో ఒక్కో పల్లె దవాఖానాను రూ.20 లక్షలతో నిర్మించారు. కాగా సరైన సదుపాయాలు కల్పించకపోవడంతో వైద్యసిబ్బంది ఇరుకు గదుల్లో విధులు నిర్వహిస్తూ ఇబ్బంది పడుతున్నారు. విద్యుత్, నీటి వసతి మరుగుదొడ్ల సదుపాయం లేకపోవడంతో సిబ్బంది విధులు నిర్వహించడం లేదు. జవారిపేటలో గ్రామం చివరలో పల్లె దవాఖాన నిర్మించగా రెండేళ్ల క్రితం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ప్రారంభించారు. కానీ అందులోకి వైద్యసిబ్బంది షిఫ్ట్ కాక గ్రామంలోని ఓ ఇరుకు గదిలో విధులు నిర్వహిస్తున్నారు. నూతనంగా నిర్మించిన భవనం నిరుపయోగంగా ఉండడంతో గుర్తు తెలియని వ్యక్తులు కిటికీల అద్దాలు పగులగొడుతున్నారు. ఊరికి చివరన నిర్మించడంతో అక్కడికి వైద్యకోసం వెళ్లడం ఇబ్బంది అవుతోందని గ్రామస్తులు వాపోతున్నారు. రేపాక భవనం పూర్తయినా గ్రామపంచాయతీ పాత భవనంలోనే వైద్యసేవలందిస్తున్నారు. వల్లంపట్లలో పల్లె పల్లె దవాఖాన నిర్మాణం పూర్తయినా గ్రామంలో ఓ ప్రైవేట్ గదిలో విధులు నిర్వహిస్తున్నారు. పల్లె ప్రజలకు వైద్య సేవలందించేందుకు ఆధునిక వసతులతో పల్లె దవాఖానాలు నిర్మించినా అవి నిరుపయోగంగా మారాయి. వెంటనే పల్లె దవాఖానల్లో సరైన సదుపాయాలు కల్పించి వినియోగంలోకి తీసుకొచ్చేలా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ దృష్టిసారించాలని మండలప్రజలు కోరుతున్నారు.

విద్యుత్, నీటి వసతిలేదు



రేపాక, జవారిపేట, వల్లంపట్ల, గ్రామాల్లోని పల్లె దవాఖానాల్లో విద్యుత్, నీటి సదుపాయం లేదు. సమస్యలపై అధికారులకు నివేదించాం. వసతులు పూర్తయిన వెంటనే వైద్యసిబ్బంది కొత్త భవనంలో వైద్య సేవలందిస్తారు. – జీవనజ్యోతి, పీహెచ్‌సీ వైద్యురాలు, ఇల్లంతకుంట

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వం పల్లె ప్రజలకు మెరుగైన వైద్యసేవలందించేందుకు పల్లె దవాఖానాలు నిర్మించింది. సిబ్బంది నూతనంగా నిర్మించిన భవనాల్లోనే విధులు నిర్వహించాలి. పల్లె దవాఖానాల్లో సరైన సదుపాయాలు కల్పించాలి. – కేతిరెడ్డి అనసూయ, వల్లంపట్ల

‘కేటీఆర్‌పై ఆరోపణలు చేస్తే సహించం’

సిరిసిల్ల అర్బన్: బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను విమర్శించే అర్హత మైనంపల్లి హనుమంతరావుకు లేదని బీఆర్‌ఎస్‌యూ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలో ఆయన మాట్లాడా రు. కేటీఆర్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కేటీఆర్‌పై మరోసారి అసత్య ఆరోపణలు చేస్తే ఊరుకోబోమన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సాయి సూర్య, ఎస్.కే అప్రోచ్, శ్రీనివాస్, అనిల్, నరేశ్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్

పదేళ్లలో రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌దే

ముస్తాబాద్: పేదలను గుర్తించి అర్హులకు పదేళ్లలో రేషన్‌కార్డులు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఏఎంసీ చైర్‌పర్సన్ తలారి రాణి అన్నారు. మండలకేంద్రంలోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో రేషన్‌కార్డుల పంపిణీ ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పదేళ్లుగా బీఆర్‌ఎస్ పరిపాలనలో వేలాది మంది పేదలకు రేషన్‌కార్డులు ఇవ్వలేదన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే సీఎం రేవంత్‌రెడ్డి హామీ మేరకు రేషన్‌కార్డులు ఇస్తున్నారన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేశ్, ప్రత్యేకాధికారి శ్రీలత, సెస్ డైరెక్టర్ అంజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు యెల్ల బాల్‌రెడ్డి, కనమేని చక్రధర్‌రెడ్డి, గుండెల్లి శ్రీనివాస్, శీల ప్రశాంత్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.



రేషన్‌కార్డులు అందజేస్తున్న నాయకులు, అధికారులు

ప్రజాపాలనలో వట్టిపోతున్న చెరువులు

ముస్తాబాద్: ప్రజాపాలనలో నీటి వనరులు ఎండుతున్నాయని, ప్రాజెక్టులను నీటితో పంపకపోవడంతో గ్రామాల్లో చెరువులు వట్టిపోతున్నాయని బీఆర్‌ఎస్ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ముస్తాబాద్‌లో నీరు లేక వెలవెలబోతున్న లింగంకుంట, పెద్ద చెరువుల వద్ద బీఆర్‌ఎస్ నాయకులు ఆదివారం నిరసన చేపట్టారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ, కాళేశ్వరం, రంగనాయకసాగర్, మిడ్‌మానేరు ప్రాజెక్టులకు నీటిని విడుదల చేయకపోవడంతో గ్రామాల్లో చెరువులు, కుంటలు అడుగంటాయని వాపోయారు. వర్షకాలంలో 50శాతం కూడా వరినాట్లు కాలేదని, రైతులు కరువుతో అల్లాడుతున్నారన్నారు. గోదావరిలో పుష్కలంగా నీరు ఉన్న ప్రాజెక్టులను కాంగ్రెస్ ప్రభుత్వం కక్షపూరితంగా నింపడం లేదని ఆరోపించారు. పట్టణాధ్యక్షుడు ఎద్దండి నర్సింహారెడ్డి, జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు సర్వర్, మాజీ సర్పంచ్ నల్ల నర్సయ్య, చెవుల మల్లేశ్, సంతోష్‌రావు, భరత్, దబ్బెడ రేణుక, రమేశ్‌రెడ్డి, సత్యంగౌడ్, బాలయ్య, నర్సింలు తదితరులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

బోనాలు, వన భోజనాలు

బోయినపల్లి: ఆషాఢ మాసం సందర్భంగా గ్రామాల్లో ఆదివారం బోనాలు.. వన భోజనాల సందడి నెలకొంది. మండలంలోని విలాసాగర్ మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు తీశారు. తడగొండ గ్రామ రెడ్డి సంఘం ఆధ్వర్యంలో కోరెం కొండ పోచమ్మ తల్లి ఆలయంలో బోనం మొక్కులు చెల్లించుకుని వన భోజనాలు చేశారు. మాన్వాడలో గ్రామస్తులు ప్రాజెక్టు కట్ట పరిసరాల్లో వన భోజనాలకు తరలి వెళ్లారు.

తంగళ్లపల్లి: ఆషాఢ మాసం సందర్భంగా బోనాల పండుగ నిర్వహించారు. పోచమ్మ, ఎల్లమ్మ ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. తంగళ్లపల్లి మానేరువాగు ఒడ్డున ఉన్న ఎల్లమ్మ తల్లి ఆలయంలో బోనం మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో కుటుంబ సమేతంగా వన భోజనాలు చేశారు.

సిరిసిల్లకల్చరల్: వాసవీనగర్‌లోని భారతి విద్యానిలయంలో బోనాల వేడుకలో విద్యార్థులు పులివేషాలు, పోతరాజుల విన్యాసాలతో ఆకట్టుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల నిర్వాహకులు వెలుముల రాంరెడ్డి, రాధ, ప్రిన్సిపాల్ కృష్ణాకర్ రెడ్డి, బాలకృష్ణ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండలంలోని పలు గ్రామాల్లో పోచమ్మ బోనాలు నిర్వహించారు. రేపాకలో యాదవులు, కురుమ, ఇల్లంతకుంటలో మాల కులస్తులు పోచమ్మ బోనాలు నిర్వహించారు. రహీంఖాన్‌పేట, ఇల్లంతకుంట, వెల్జీపూర్ గ్రామాల్లో కులసంఘాల వారు వనభోజనాలకు వెళ్లారు. మహిళలు నెత్తిన బోనాలతో డప్పు చప్పుళ్ల మధ్య ఆలయానికి వెళ్లి నైవేద్యం సమర్పించారు. వర్షాలు సమృద్ధిగా పాడి పంటలు పండాలని అమ్మవారిని వేడుకున్నారు.



బోయినపల్లి : విలాసాగర్‌లో డప్పు చప్పుళ్ల మధ్య బోనాలతో తరలివెళ్తున్న గ్రామస్తులు



ఇల్లంతకుంటలో..



తంగళ్లపల్లి : వన భోజనాలు చేస్తున్న భక్తులు

సభను విజయవంతం చేయాలి

సిరిసిల్ల అర్బన్ : జిల్లాకేంద్రంలోని కే కన్‌వర్షన్ ఫక్షన్ హాల్‌లో ఈనెల 27న నిర్వహించే మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు బడుగు లింగయ్య కోరారు. ఆదివారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పెన్షన్ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలుచేయాలని కోరుతూ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశానికి ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ హాజరుకానున్నారని, సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో ఆపార్టీ నాయకులు పురుషోత్తం రావు, రవీందర్, ప్రభాకర్, ఖానాపూర్ లక్ష్మణ్, శోభరాణి, తదితరులు పాల్గొన్నారు.

పెద్ద ఎత్తున తరలిరావాలి



ఇల్లంతకుంట: ఈనెల 27న జిల్లాలో జరిగే మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలని జిల్లా ఎమ్మార్పీఎస్ ఇన్‌చార్జి నాయకుడు పుట్ట రవి అన్నారు. మండల వికలాంగుల పోరాట సమితి కన్వీనర్‌గా కేతిరెడ్డి లక్ష్మారెడ్డిని ఆదివారం ఎన్నుకున్నారు. పెన్షన్‌దారుల సమావేశానికి మందకృష్ణ మాదిగ పాల్గొంటారని పెద్ద ఎత్తున తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మందరాజు, ఉపాధ్యక్షుడు కాసుపాక సురేశ్, నాయకులు పసుల వెంకటి, మచ్చ రాజేశం, లక్ష్మణ్, మంజుల, లావణ్య, పెన్షన్‌దారులు, తదితరులు పాల్గొన్నారు.

పీఈటీల సంఘం జిల్లా అధ్యక్షుడిగా సురేశ్



సిరిసిల్లటౌన్/సిరిసిల్లకల్చరల్: వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఆదివా రం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తడుకల సురేశ్, గౌరవాధ్యక్షుడిగా విశ్రాంత పీఈటీ దుప్పటి రవికుమార్ ఎంపికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు తునికి విజయసాగర్ ప్రకటించారు. జిల్లాలోని పీఈటీల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు పాఠశాలల్లో శారీరక విద్యాభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు.

బీజేపీ బలోపేతానికి కృషిచేయాలి



జెండా ఎగురవేస్తున్న నాయకులు

సిరిసిల్ల అర్బన్: రానున్న రోజుల్లో బీజేపీ బలోపేతానికి ప్రతీ కార్యకర్త కృషిచేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు దుమాల శ్రీకాంత్ అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని 35వ వార్డులో బీజేపీ నాయకుడు సూరం వినయ్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ, పార్టీలో చేరికల కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ సత్తాచాటాలన్నారు. 42 శాతం బీసీ రిజర్వేషన్ అంటున్న అధికార పార్టీ ముస్లింలకు 10 శాతం కేటాయించిందన్నారు. బీజేపీ మతపరమైన రిజర్వేషన్లకు వ్యతిరేకమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆడెపు రవీందర్, నాయకులు రాంప్రసాద్, నాగుల శ్రీనివాస్, బీజేపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



చందుర్తి: మండలంలోని మర్రిగడ్డ రైతువేదిక ఆవరణలో పట్టపగలే లైట్లు వెలుగుతున్నాయి. రైతు వేదికలకు ఇప్పటికే మెయింటనెన్స్ నిధులు మంజూరు చేయకపోవడంతో ఆ భారమంతా వ్యవసాయ విస్తీర్ణాధికారి భరిస్తున్నట్లు చెప్పుకుంటున్నారు. రైతు వేదిక ఆవరణలో అవసరం లేకున్నా నాలుగు లైట్లు నిరంతరంగా వెలుగుతున్నాయి. దీంతో విద్యుత్ వినియోగం తగ్గించుకోవాలని గ్రామస్తులు అభిప్రాయపడుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి :
శిరీష , ఎంఈవో, మర్రిగడ్డ సెల్ : 9948933599

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి ‘సాక్షి’ కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

జాబ్‌మేళాలో ముప్పై మందికి ఉద్యోగాలు

సిరిసిల్లటౌన్: హైదరాబాద్ తదితర నగరాల్లో వివిధ కంపెనీల్లో జిల్లాకు చెందిన 30 మంది యువత ఉద్యోగాలు సాధించారు. పట్టణంలోని నేతాజీ డిగ్రీ కళాశాలలో రెండురోజులుగా వివిధ కంపెనీలకు చెందిన ప్రతినిధులు డిజిటల్ మార్కెటింగ్, హ్యూమన్ రిసోర్స్, తదితర అంశాల్లో ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహించారు. 30 మందిని వివిధ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. కళాశాల చైర్మన్ జూపల్లి పృథ్వీధర్‌రావు మాట్లాడుతూ, వచ్చే విద్యాసంవత్సరం నుంచి కళాశాలలో చదువుకునే డిగ్రీ విద్యార్థులకు మాత్రమే ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రాజెక్ట్ వర్క్స్ చేయించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్లు జగన్మోహన్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాలు సాధించినవారికి సర్టిఫికెట్స్ అందజేస్తున్న పృథ్వీధర్‌రావు

యువత రాజకీయాల్లోకి రావాలి

సిరిసిల్ల అర్బన్ : యువత రాజకీయాల్లోకి రావాలని కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బుర్ర రవితేజ గౌడ్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఓ పాఠశాలలో రాజకీయాల్లో యువత అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి వివిధ మండలాల నుంచి రాజకీయ నాయకులు, స్వచ్ఛంద సంస్థ నాయకులు, విద్యార్థులు, యువ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. దేశ భవిష్యత్ యువత చేతిలో ఉందన్నారు. కార్యక్రమంలో చందుర్తి మాజీ జెడ్పీటీసీ నాగంకుమార్, పలు పార్టీల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న రాజకీయ నాయకులు, యువకులు

హైలెవల్ వంతెన పనులు ప్రారంభం

బోయినపల్లి: బోయినపల్లి నుంచి వేములవాడ వెళ్లే రోడ్డులో స్తంభంపల్లి హైలెవల్ వంతెన పనులు ఆదివారం తిరిగి ప్రారంభమయ్యాయి. ఈనెల 9న ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా బ్రిడ్జిని సందర్శించి పనులు జాప్యంపై కాంట్రాక్టర్‌పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. పనుల ప్రారంభంలో అలసత్వం వీడాలని పీఆర్ ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో పనులు మొదలుకావడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గం ఎన్నిక



వేములవాడ: వేములవాడ బ్రాహ్మణ నిత్యాన్న సత్రం ఆవరణలో గౌరవాధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అధ్యక్షతన ఆదివారం బ్రాహ్మణ సేవా సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా మామిడిపల్లి వెంకటేశం, ఉపాధ్యక్షులుగా మధు ప్రవీణ్, దుమల కార్తీక్, ప్రధాన కార్యదర్శిగా నందగిరి రాజేంద్రశర్మ, ఆర్గనైజింగ్ సెక్రెటరీలుగా చొప్పకట్ల శ్రీకాంత్, హరాచారి మహేశ్, సంయుక్త కార్యదర్శులుగా నమిలకొండ నరహరి, సువర్ణ చంద్రశేఖర్, కోశాధికారిగా దుమాల కౌశిక్, వైదిక కమిటీ సభ్యులుగా కుంభకోణం రాజేందర్, గోపన్నగారి గణేశ్, అత్తలూరి మల్లికార్జున్ శర్మ, టంగుటిక కోటేష్, చొప్పకట్ల కార్తీక్, కార్యవర్గ సభ్యులుగా ప్రతాప నటరాజ్, చెన్నోజ్జల లక్ష్మణ్, బూరుగడ్డ నందు, బాయి సుమన్, మధు హరికృష్ణ, పారువెల్ల వెంకన్న, శ్రీనివాస్, ఆయాచితుల జితేందర్ ఎన్నికయ్యారు. న్యాయ సలహాదారులుగా కేశన్నగారి గోపికృష్ణ, పారువెల్ల శ్రీనివాస్, ప్రతాప సంతోష్, గౌరవ సలహాదారులుగా వాసాలమర్రి విఠల్, ప్రతాప సుధాకర్, గర్శకుర్తి వెంకటేశ్వర్లు, ఈశ్వరగారి నరహరిశర్మ, గోపన్నగారి శంకరయ్యలు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో డాక్టర్ మధు రాధాకిషన్, చొప్పకట్ల భాను, వేణుగోపాల్ పురాణం రాము, బుడంగారి మహేశ్, నమిలకొండ జయంత్, తిగుళ్ల కిషన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనను అడ్డుకుంటున్న బీఆర్‌ఎస్, బీజేపీ

గంభీరావుపేట: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన ప్రజాపాలనను బీఆర్‌ఎస్, బీజేపీలు అడ్డుకుంటున్నాయని ఇండియా ప్రజాబంధు పార్టీ జిల్లా అధ్యక్షుడు దోసల చంద్రం అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతుంటే ఓర్వలేని ఆరెండు పార్టీలు విమర్శలు చేస్తున్నాయన్నారు.

గ్యాస్ సిలిండర్ల పంపిణీ



ప్రధానోపాధ్యాయులకు సిలిండర్లను పంపిణీ చేస్తున్న ఎంఈవో

చందుర్తి: మండలంలోని పలు గ్రామాల్లో ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం అందజేసిన సిలిండర్లను మండల విద్యాధికారి వినయ్‌కుమార్ ఆదివారం పంపిణీ చేశారు. ప్రధానోపాధ్యాయులు గడప రఘుపతిరా వు, కట్కూరి ముకేష్, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెండింగ్ కేసుల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి



శ్రీనివాస్‌రావును సత్కరిస్తున్న సంఘం బాధ్యులు

సిరిసిల్లకల్చరల్: కేసుల పరిష్కారం దిశగా అడుగులు పడాల్సిన అవసరం ఉందని ఫోరమ్ ఫర్ జస్టిస్ ఫౌండర్ చైర్మన్ భగవాన్ జిరేనియన్, ప్రవీణ్ పటేల్ అన్నారు. కరీంనగర్ కృషిభవన్‌లో ఆదివారం జరిగిన సదస్సులో మాట్లాడారు. దేశంలో ఐదు కోట్లకు పైగా రాష్ట్రంలో 11లక్షలు, కరీంనగర్‌లో 38,600 కేసులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. వీటి పరిష్కారం దిశగా తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. ఈ సందర్భంగా రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షుడు జూపెల్లి శ్రీనివాసరావు మాట్లాడారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 13,400 కేసులను త్వరితగతిన పరిష్కరించేందుకు అవసరమైన పనులు ఊపందుకుంటున్నాయని పేర్కొన్నారు. వివిధ ప్రాంతాల న్యాయవాదుల సంఘం బాధ్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి.. బ్లీచింగ్ చల్లి



డ్రైనేజీలో బ్లీచింగ్ చల్లుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

గంభీరావుపేట: ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేటలో బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో గ్రామాలు దుర్భర పరిస్థితుల్లో ఉన్నాయని, పల్లెలను ప్రభుత్వం విస్మరించిందని ఆరోపిస్తూ బీఆర్‌ఎస్ నాయకులు గ్రామంలోని డ్రైనేజీల్లో బ్లీచింగ్ చల్లారు. అనంతరం మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వరుస కృష్ణహరి, మాజీ జెడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, మాజీ ఎంపీపీ పిల్లి రేణుక, కిషన్, సింగిల్‌విండో అధ్యక్షులు గుండారపు కృష్ణారెడ్డి, నాయకులు అందె సుభాష్, మురళీగౌడ్, నలిమికొండ శ్రీనివాస్, బందారపు బాల్‌రెడ్డి, నర్సింలు, శివారెడ్డి, సీత్యానాయక్, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కార్డు ప్రయోజనాలు పెంచాలి

కోనరావుపేట: కార్మికుల సంక్షేమం కోసం అందిస్తున్న లేబర్‌కార్డు ప్రయోజనాలను పెంచాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. మండలకేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ఆరోగ్య పరీక్షల నిమిత్తం సంక్షేమ నిధిలోని డబ్బులను వృథా చేస్తున్నారన్నారు. లేబర్‌కార్డుదారులు సహజ మరణానికి రూ. 5 లక్షలు, ప్రమాదంలో మృతిచెందితే రూ.10 లక్షలు, వివాహానికి రూ.లక్ష, డెలివరీకి రూ.50వేలు, 55 ఏళ్లు నిండిన కార్మికులకు రూ.5వేల పింఛన్ చొప్పున అందించాలని కోరారు. తైదల చంద్రయ్య, పులి బాబు, ఎండీ ఖాసీం, తాటకార్ల చంద్రమౌళి, బొల్లె బాబు, బొల్లె రాజయ్య, గొట్టె శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



వేములవాడ: పట్టణంలోని ఎరువుల దుకాణాల్లో మండల వ్యవసాయాధికారులు ఆదివారం తనిఖీ చేశారు. రైతులకు ఎరువులు సక్రమంగా అందించాలన్నారు. ఎరువుల బస్తాలు, వాటినిల్వల వివరాలను తెలుసుకున్నారు. మండల వ్యవసాయాధికారి సాయికిరణ్, వ్యవసాయ విస్తరణ అధికారి రాజు తదితరులున్నారు.

ఆట విడుపు



గంభీరావుపేట: మండలకేంద్రంలో నిర్వహించిన రేషన్‌కార్డుల జారీ కార్యక్రమానికి హాజరయ్యేందుకు వస్తున్న కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డికి రోడ్డుపై గోలీలాడుతున్న చిన్నారులు కనిపించారు. దీంతో చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ వారితో కలిసి గోలీలాడారు. అనంతరం చిన్నారులు ఎలా చదువుతున్నారో తెలుసుకున్నారు.

పేకాటస్థావరంపై దాడి

తంగళ్లపల్లి: ఓబులాపూర్ శివారులో ఆదివారం పేకాటస్థావరంపై దాడిచేసి పలువురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై ఉపేంద్రచారి తెలిపారు. గ్రామ శివారులో పేకాటాడుతున్న సింగి రెడ్డి సుధాకర్ రెడ్డి, ఆసం శ్రీనివాస్, కొమ్ము రవి, బాలసాని పరశురాములు, పరుస లచ్చయ్యపై కేసు నమోదుచేసి వారి నుంచి రూ.23వేల నగదు, రెండు బైక్‌లను సీజ్ చేశామన్నారు.